ఫైనల్ | భారత్ X ఆస్ట్రేలియా | నవంబర్ 19 మ. 2.00 నుంచి | వేదిక: అహ్మదాబాద్

ఒత్తిడికి చిత్తయిన దక్షిణాఫ్రికా

# ఫైనల్లో ఆసీస్

రెండో సెమీస్‌లో కంగారూల అద్భుత విజయం

## ప్రపంచకప్ తుదిపోరులో ఆసీస్‌తో భారత్ ఢీ • హెడ్ ఆల్‌రౌండ్ మెరుపులు

వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాకు మరోసారి నిరాశ తప్పలేదు. చివరి వరకు పట్టు వదలకుండా పోరాడిన సఫారీలు.. సెమీఫైనల్ ఒత్తిడిని తట్టుకోలేక చతికిలబడగా.. పెద్ద మ్యాచ్‌ల్లో ఎలా రాణించాలో ఉగ్గు పాలతో నేర్చుకున్న ఆస్ట్రేలియా రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి వరల్డ్‌కప్ ఫైనల్లో అడుగుపెట్టింది.

గత మ్యాచ్‌ల్లో దంచికొట్టిన సఫారీ టాపార్డర్.. కంగారూ బౌలర్ల ధాటికి ఉసూరు మనిపించగా.. డేవిడ్ మిల్లర్ ఒంటరి పోరాటంతో సూపర్ సెంచరీ చేశాడు. క్లాసెన్ కాస్త సహకరించడంతో ఆసీస్ ముందు స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించిన ప్రొటీస్.. ఆ తర్వాత దాన్ని కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

ఆసీస్ ఓపెనర్లు ఆరంభంలోనే బౌండ్రీల మోత మోగించగా.. కేశవ్, తబ్రేజ్ షంసీ కట్టుదిట్టమైన బంతులతో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చారు. లీగ్ దశలో అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో దీని కన్నా ఘోరమైన స్థితి నుంచి మ్యాక్స్‌వెల్ ఒక్కడే ఆసీస్‌ను గట్టెక్కించగా.. ఇప్పుడు తలా కొన్ని పరుగులతో కంగారూలు తుదిపోరుకు చేరారు.

ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరుగనున్న మెగా ఫైనల్లో భారత్, ఆసీస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

మిల్లర్ (101)

హెడ్ (62; 2/21)

కోల్‌కతా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆస్ట్రేలియా ఎనిమిదోసారి వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించింది. తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించిన భారత్‌తో ఆదివారం అహ్మదాబాద్‌లో జరుగనున్న టైటిల్ ఫైట్‌లో ఆసీస్ తలపడనుంది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఇరు జట్ల బౌలర్లు రాణించినా.. ఒత్తిడిని అధిగమించిన ఆసీస్‌ను విజయం వరించింది. టోర్నీ ఆసాంతం తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు భారీ స్కోర్లు చేస్తూ.. ప్రత్యర్థులను హడలెత్తించిన దక్షిణాఫ్రికా ఈ సారి అదే ప్రదర్శన పునరావృతం చేయలేకపోయింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా.. 49.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (116 బంతుల్లో 101; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆణిముత్యం లాంటి సెంచరీతో చెలరేగగా.. హెన్రిచ్ క్లాసెన్ (47; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) పర్వాలేదనిపించాడు. మెగాటోర్నీలో సెంచరీల మీద సెంచరీలు బాదుతూ.. కొత్త రికార్డులు నెలకొల్పిన స్టార్లు కీలక మ్యాచ్‌లో విఫలమయ్యారు. కెప్టెన్ టెంబా బవుమా (0) తొలి ఓవర్‌లోనే ఖాతా తెరవకుండా వెనుదిరగగా.. డికాక్ (3), మార్క్‌రమ్ (10), డసెన్ (6) అతడిని అనుసరించారు. దీంతో 24 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్లాసెన్, మిల్లర్ పోరాడి జట్టును తిరిగి పోటీలోకి తెచ్చినా.. హెడ్ ఒకే ఓవర్‌లో క్లాసెన్, జాన్సన్ (0) ఔట్ చేసి సఫారీలను తక్కువ స్కోరుకు పరిమితం చేశాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కమిన్స్ చెరో మూడు, హజిల్‌వుడ్, హెడ్ చెరో 2 వికెట్లు తీశారు. సఫారీ ఇన్నింగ్స్‌కు కాసేపు వర్షం అంతరాయం కలిగించింది. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా.. 47.2 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (48 బంతుల్లో 62; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా.. స్టీవ్ స్మిత్ (62 బంతుల్లో 30), జోష్ ఇంగ్లిస్ (49 బంతుల్లో 28), డేవిడ్ వార్నర్ (18 బంతుల్లో 29; ఒక ఫోర్, 4 సిక్సర్లు) రాణించారు. చివర్లో స్టార్క్ (38 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు), కమిన్స్ (29 బంతుల్లో 14 నాటౌట్; 2 ఫోర్లు) అసమాన పోరాటంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కోట్జీ, షంసీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

### సంక్షిప్త స్కోర్లు

**దక్షిణాఫ్రికా:** 49.4 ఓవర్లలో 212 ఆలౌట్ (మిల్లర్ 101, క్లాసెన్ 47; స్టార్క్ 3/34, కమిన్స్3/51), **ఆస్ట్రేలియా:** 47.2 ఓవర్లలో 215/7 (హెడ్ 62, స్మిత్ 30; షంసీ 2/42, కోట్జీ 2/47).

**8**

వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరడం ఆస్ట్రేలియాకు ఇది ఎనిమిదోసారి. 1975, 1987, 1996, 1999, 2003, 2007, 2015లోనూ తుదిపోరుకు చేరిన ఆసీస్ అందులో ఐదుసార్లు (1987, 1999, 2003, 2007, 2015లో) విశ్వ విజేతగా నిలిచింది.

**2**

భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్లో తలపడనుండటం ఇది రెండోసారి. 2003 తుదిపోరులో ఆసీస్ చేతిలో భారత్ ఓడింది.

**5**

వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓడటం దక్షిణాఫ్రికాకు ఇది ఐదోసారి. ఇంతకు ముందు 1992, 1999, 2007, 2015లోనూ ఓడింది.

## అయ్యో ఆఫ్రికా..

విజయం సాధించాలంటే.. కష్టానికి తోడు ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలని ఎందుకు అంటారో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో దుమ్మురేపే ప్రదర్శనలు చేస్తూ.. ప్రపంచంలో ఏ జట్టునైనా వణికించగల దక్షిణాఫ్రికా.. ఐసీసీ టోర్నీల్లో మాత్రం తేలిపోతుందని చరిత్ర చెబుతున్నది. ఇప్పటికే పలుమార్లు చేతుల్లోకి వచ్చిన అవకాశాలను వదిలేసుకొని 'చోకర్స్'అని ముద్ర వేసుకున్న సఫారీలు.. మరోసారి రిక్తహస్తాలతో ఇంటి బాటపట్టారు. ఈ మ్యాచ్‌లో టాపార్డర్ విఫలమైన విషయాన్ని పక్కన పెడితే.. మిగిలిన అన్ని విభాగాలు ప్రాణం పెట్టి పోరాడాయి. కీలక సమయంలో డేవిడ్ మిల్లర్ సెంచరీతో తన విలువ చాటుకుంటే.. క్లాసెన్ అతడికి సహకరించాడు. చివర్లో కోట్జీ (39 బంతుల్లో 19) గొప్ప సంయమనం కనబర్చాడు. ఇక నామమాత్రమైన స్కోరును కాపాడుకునే క్రమంలో దక్షిణాఫ్రికా బౌలర్లు సర్వస్వం ధారపోశారు. కొట్టింది తక్కువ పరుగులే అయినా.. వాటిని కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. ప్రపంచంలో అత్యుత్తమ ఫీల్డింగ్ దళంగా గుర్తింపు పొందిన దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్‌లో ఆకట్టుకోలేక.. అవకాశాలను వృథా చేసుకుంది. అసాధ్యం అనుకున్న క్యాచ్‌లను సైతం అవలీలగా అందుకోగల సఫారీలు.. చేతుల్లో పడ్డ బంతులను నేలపాలు చేసి మూల్యం చెల్లించుకున్నారు. ఆసీస్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచిన హెడ్‌కు రెండు సార్లు జీవనదానం ఇచ్చిన దక్షిణాఫ్రికా.. స్మిత్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను కూడా నేల పాలు చేసింది. ఇక ఆఖర్లో కమిన్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను సైతం వికెట్ల వెనుక డికాక్ అందుకోలేకపోయాడు. మ్యాచ్ మొత్తం అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ప్రొటీస్.. అదృష్టం కలిసిరాక ఈసారి కూడా నిరాశగానే వెనుదిరిగింది. ఈ టోర్నీలో నాలుగు సెంచరీలతో సత్తాచాటిన దక్షిణాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ ఈ మ్యాచ్‌తోనే అంతర్జాతీయ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

-నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

## సచిన్‌ను కోహ్లీ దాటేస్తాడు: రవిశాస్త్రి

ముంబై: భారత స్టార్ క్రికెటర్ విరాట్‌కోహ్లీపై ప్రశంసల వర్షం కురుస్తూనే ఉన్నది. న్యూజిలాండ్‌తో సెమీఫైనల్లో సెంచరీ ద్వారా వన్డేల్లో 50 శతకాల మార్క్ అందుకున్న విరాట్‌ను పలువురు ప్రముఖులు అభినందనల సందేశాలతో ముంచెత్తుతున్నారు. కోహ్లీ వేరే గ్రహం నుంచి వచ్చాడంటూ వెస్టిండీస్ గ్రేట్ వీవీయన్ రిచర్డ్స్ అంటే సెర్బియా టెన్నిస్ స్టార్ జొకోవిచ్..కోహ్లీని అభినందిస్తూ ఎక్స్‌లో సందేశం రాసుకొచ్చాడు. అయితే క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ శతక సెంచరీల రికార్డును కోహ్లీ కచ్చితంగా దాటేస్తాడని మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి బల్లగుద్ది మరీ చెబుతున్నాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి సచిన్ వంద శతకాలు చేయగా, కోహ్లీ 80 సెంచరీలతో కొనసాగుతుండగా, రికీ పాంటింగ్(71) మూడో స్థానంలో ఉన్నాడు. ఐసీసీకి ఇచ్చిన ప్రత్యేక రివ్యూలో శాస్త్రి పలు అంశాలను ప్రస్తావించాడు. 'సచిన్ వంద సెంచరీలు చేస్తాడని ఎవరైనా ఊహించారా? ఇది అంతే. అతని దరిదాపుల్లో ఎవరూ రారనుకున్నాం. కానీ కోహ్లీ ప్రస్తుతం 80 సెంచరీలతో కొనసాగుతున్నాడు. రానున్న పది ఇన్నింగ్స్‌ల్లో అతడు కచ్చితంగా ఐదు సెంచరీలు కొడతాడు. ఇలాంటి ప్లేయర్లకు ఏదీ అసాధ్యం కాదు. ఒక్కసారి ఫామ్‌లోకి వచ్చారంటే వారిని ఆపడం అసాధ్యం. ప్రస్తుతం కోహ్లీ అన్ని ఫార్మాట్లలో ఉన్నాడు. మరో మూడు, నాలుగేండ్లు జాతీయ జట్టుకు ఆడుతాడు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతంగా ఆడుతూ రికార్డులు కొల్లగొట్టడం అతని నైజం. అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ఫోర్లు, సిక్స్‌ల కన్నా..వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తేందుకు విరాట్ ప్రయత్నిస్తాడు' అని పేర్కొన్నాడు.

## ముగిసిన భారత్ చాలెంజ్

కుమమోటో : జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన ఏకైక భారత షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ గురువారం రెండో రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన చౌ టీన్ చెన్ చేతిలో ఓడిపోయాడు. 73 నిమిషాలపాటు సాగిన పోరులో తొలి గేమ్ గెలిచి ఆధిక్యంలో నిలిచిన ప్రణయ్ తరువాత తడబడడంతో ప్రత్యర్థి వరుస గేమ్‌లు గెలుచుకుని ముందంజ వేశాడు. ప్రపంచ నంబర్12 చెన్ చేతిలో ప్రణయ్ 21-19, 16-21, 19-21 స్కోరుతో ఓటమి పాలయ్యాడు. తొలి గేమ్‌లో 4-0, 11-8తో ఆధిక్యంలో నిలిచి ప్రణయ్ సత్తాచాటాడు. చెన్ ఒత్తిడి పెంచినా ప్రణయ్ ఏమాత్రం తడబడక తొలి గేమ్‌ను గెలుచుకున్నాడు. అయితే రెండో గేమ్ నుంచి స్పీడ్ పెంచిన చెన్ స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకుంటూ, ప్రణయ్‌కు ఏమాత్రం అవకాశమివ్వక మ్యాచ్‌ను దక్కించుకున్నాడు.

## ఫైనల్లో సూర్యకిరణ్ ప్రదర్శన

అహ్మదాబాద్: అహ్మదాబాద్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అభిమానులకు కొత్త అనుభూతిని అందించబోతున్నది. ఈ నెల 19వ తేదీన జరుగనున్న ప్రపంచకప్ ఫైనల్లో భారత ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ ప్రదర్శనలు ఇవ్వబోతున్నది. ఈ విషయాన్ని గుజరాత్‌కు చెందిన డిఫెన్స్ పీఆర్వో గురువారం ఒక ప్రకటనలో ధృవీకరించారు. ఫైనల్ పోరు మొదలయ్యే పది నిమిషాల ముందు మొతెరా స్టేడియంపై సూర్యకిరణ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఆకాశంలో అద్భుత విన్యాసాలతో అలరించనున్నాయి. మొత్తం తొమ్మిది ఎయిర్‌క్రాఫ్ట్‌లు రకరకాల ఆకారాలతో అబ్బురపరుచనున్నాయి. శుక్ర, శనివారాల్లో ఎయిర్‌షో రిహార్సల్స్ ఉంటాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.